మారుట్ డ్రోన్స్ నిధుల సేకరణ

హైదరాబాద్, నవంబర్ 5: హైదరాబాద్ కేంద్రంగా డ్రోన్స్ సేవలు అందిస్తున్న మారుట్ డ్రోన్స్..సిరీస్ ఏ ఫండింగ్‌లో భాగంగా 6.2 మిలియన్ డాలర్ల(రూ.50 కోట్లకు పైమాటే) నిధులు సమీకరించుకున్నది. లోక్ క్యాపిటల్ నుంచి సేకరించిన ఈ నిధులను డ్రోన్ల తయారీ సామర్థ్యాన్ని 3 వేల యూనిట్లకు పెంచుకోవడానికి వినియోగించనున్నట్లు కంపెనీ సీఈవో, కో-ఫౌండర్ ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ నిధులతోనే అడ్వాన్స్ అగ్రికల్చరల్ డ్రోన్లను కూడా తయారు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. వచ్చే ఐదేండ్లలో రూ.1,000 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ..అందుకు తగ్గట్టుగానే ప్రణాళికను వేగవంతం చేసినట్లు తెలిపారు.

ఈ2ఈ నెట్‌వర్క్స్‌లో ఎల్ అండ్ టీకి వాటా!



న్యూఢిల్లీ, నవంబర్ 5: క్లౌడ్ సేవల పరిధిని మరింత విస్తరించడానికి దేశీయ మౌలిక సదుపాయాల దిగ్గజం లార్సెన్ అండ్ టుబ్రో(ఎల్అండ్‌టీ) మరో సంస్థను చేజిక్కించుకోవడానికి సిద్ధమైంది. ఇదే క్రమంలో ఈ2ఈ నెట్‌వర్క్స్ లిమిటెడ్‌లో 21 శాతం వాటాను కొనుగోలు చేయబోతున్నట్లు ప్రకటించింది. ఒప్పందం విలువ రూ.1,407.02 కోట్లు. క్లౌడ్, కృత్రిమ మేధస్సు ఆధారిత సర్వీసుల పరిధిని మరింత విస్తరించాలనే ఉద్దేశంతో ఈ కొనుగోలు జరిపినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. టెక్నాలజీ రంగంలో కీలక వృద్ధిని నమోదు చేసుకుంటున్న ఈ రెండు విభాగాలు. ఇరు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా ఎల్అండ్‌టీ 15 శాతం వాటాను కొనుగోలు చేయడానికి రూ.1,079 కోట్ల నిధులు వెచ్చించనుండగా, మరో ఆరు శాతం వాటాను కొనుగోలుకు రూ.327.75 కోట్లు వెచ్చించనున్నది. ఈ ఒప్పందం వచ్చే నెల చివరినాటికి పూర్తికానున్నది.

మరో 15 ఆర్ఆర్‌బీలు ఔట్!

తెలంగాణ, ఏపీసహా ఆయా రాష్ర్టాల్లో విలీనం కానున్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు • కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కసరత్తు



న్యూఢిల్లీ, నవంబర్ 5: దేశంలో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు (ఆర్ఆర్‌బీ)ల సంఖ్య మరింత తగ్గిపోనున్నది. నాల్గో విడుత విలీన ప్రక్రియను ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నది. ఇందులో భాగంగానే ప్రస్తుతం 43గా ఉన్న ఆర్ఆర్‌బీలను 28కి తగ్గించాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కసరత్తు చేస్తున్నది. ఈ క్రమంలోనే ఆయా రాష్ర్టాల్లో నడుస్తున్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో 15 బ్యాంకులను ఇతర బ్యాంకుల్లో విలీనం చేయబోతున్నారు. కాగా, ఆర్ఆర్‌బీల కార్యకలాపాలను మరింత ప్రభావవంతంగా మార్చడం, ఖర్చుల హేతుబద్ధీకరణే లక్ష్యంగా ఈ విలీనాలకు దిగుతున్నట్టు మోదీ సర్కారు చెప్తున్నది.

ఏయే రాష్ర్టాల్లో..

ఆంధ్రప్రదేశ్‌లో గరిష్ఠంగా 4 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు నడుస్తున్నాయి. అలాగే ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో మూడేసి ఆర్ఆర్‌బీలు పనిచేస్తున్నాయి. ఇక బీహార్, గుజరాత్, జమ్ముకశ్మీర్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిషా, రాజస్థాన్ రాష్ర్టాల్లో రెండేసి చొప్పున ఉన్నాయి. దీంతో ఈ రాష్ర్టాల్లోని 26 బ్యాంకుల్లో 15 బ్యాంకుల్ని విలీనం చేయాలని నాబార్డుతో కలిసి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఓ రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసింది. అయితే తెలంగాణలో మాత్రం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ), తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మధ్య ఏపీజీవీబీ ఆస్తులు, అప్పుల విభజనకు లోబడి ఈ ఆర్ఆర్‌బీల విలీన ప్రక్రియ సాగనున్నది. కాగా, ఈ నెల 20కల్లా ఈ విలీన ప్రక్రియపై అభిప్రాయాలను తెలియపర్చాలంటూ ఆయా ఆర్ఆర్‌బీలకు స్పాన్సర్స్‌గా వ్యవహరిస్తున్న బ్యాంక్ అధిపతులకు కేంద్ర ఆర్థిక సేవల శాఖ స్పష్టం చేసింది.

మొదట్లో 196 ఆర్ఆర్‌బీలు

దేశంలో మునుపు 196 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులుండేవి. అయితే 2004-05 ఆర్థిక సంవత్సరంలో ఆర్ఆర్‌బీల నిర్మాణాత్మక విలీన ప్రక్రియను నాటి కేంద్ర ప్రభుత్వం మొదలుపెట్టింది. ఇలా మూడు దశల్లో చేపట్టిన విలీనాలతో దేశవ్యాప్తంగా ఆర్ఆర్‌బీల సంఖ్య 2020-21 నాటికి 196 నుంచి 43కు తగ్గింది. 1976 ఆర్ఆర్‌బీ చట్టం కింద ఈ బ్యాంకులన్నీ ఏర్పాటయ్యాయి. చిన్న-సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ ప్రాంతాల్లోని కళాకారులకు రుణ, ఇతరత్రా సదుపాయాలను కల్పించాలనే ఉద్దేశ్యంతో వీటిని తెచ్చారు. ప్రస్తుతం ఆర్ఆర్‌బీల్లో కేంద్ర ప్రభుత్వానికి 50 శాతం వాటా ఉండగా, ప్రభుత్వ రంగ స్పాన్సర్డ్ బ్యాంకులకు 35 శాతం, రాష్ట్ర ప్రభుత్వాలకు 15 శాతం చొప్పున వాటాలున్నాయి. కాగా, ఆర్ఆర్‌బీలను తమతమ స్పాన్సర్డ్ బ్యాంకుల్లోనే విలీనం చేయాలని బ్యాంక్ ఉద్యోగ సంఘాలైన ఏఐబీవోసీ, ఏఐబీఈఏ డిమాండ్ చేస్తున్నాయి.

కోలుకున్న స్టాక్ మార్కెట్లు

సెన్సెక్స్ 694, నిఫ్టీ 218 పాయింట్ల లాభం

ముంబై, నవంబర్ 5: స్టాక్ మార్కెట్లు తిరిగి కోలుకున్నాయి. ప్రారంభంలో భారీగా నష్టపోయిన సూచీలకు చివర్లో మదుపరులు ఎగబడి కొనుగోళ్లు జరపడంతో సూచీలు తిరిగి లాభాలబాట పట్టాయి. ఒకదశలో వెయ్యి పాయింట్లకు పైగా నష్టపోయిన సూచీలకు బ్యాంకింగ్, స్టీల్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగ షేర్ల నుంచి లభించిన మద్దతుకుతోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలను ముందువైపు నడిపించాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 694.39 పాయింట్లు ఎగబాకి 79,476.63 పాయింట్లకు చేరుకోగా, మరో సూచీ నిఫ్టీ సైతం 217.95 పాయింట్లు అందుకొని 24,213.30 వద్ద స్థిరపడింది. అమెరికా అధ్యక్ష ఎన్నికలు మదుపరులపై ప్రతికూల ప్రభావం చూపడంతో తొలి సెషన్‌లో అమ్మకాలకు మొగ్గుచూపారు. ఫలితంగా 78,300 పాయింట్ల దిగువకు పడిపోయిన సెన్సెక్స్ మధ్యాహ్నం తర్వాత మదుపరులు కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో తిరిగి కోలుకున్నదని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి.

టాప్ గెయినర్‌గా జేఎస్‌డబ్ల్యూ స్టీల్

జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేరు టాప్ గెయినర్‌గా నిలిచింది. కంపెనీ షేరు ఐదు శాతానికి పైగా లాభపడింది. దీంతోపాటు టాటా స్టీల్ కూడా 4 శాతం ఎగబాకింది. అలాగే యాక్సిస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్బీఐ, కొటక్ మహీంద్రా బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించింది. కానీ, అదానీ పోర్ట్స్, ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టపోయాయి. రంగాలవారీగా మెటల్ రంగ సూచీ అత్యధికంగా 2.38 శాతం ఎగబాకింది. దీంతోపాటు బ్యాంకింగ్, కమోడిటీస్, ఆర్థిక సేవలు, టెలికం, ఆటో, రియల్టీ, యుటిలిటీ రంగ షేర్లు లాభాల్లో ముగిశాయి.

ఆకాశ ఎయిర్ నష్టం 1,670 కోట్లు

న్యూఢిల్లీ, నవంబర్ 5: రెండేండ్ల క్రితం విమాన సేవలు ఆరంభించిన ఆకాశ ఎయిర్ భారీ నష్టాలను మూటగట్టుకున్నది. మార్చి 2024తో ముగిసిన ఏడాదికిగాను సంస్థకు రూ.1,670.06 కోట్ల నష్టం వచ్చినట్లు పేర్కొంది. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.3,144.38 కోట్లకు ఎగబాకింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో కూడా రూ.744.53 కోట్ల నష్టం వచ్చింది. ప్రస్తుతం సంస్థ ప్రతిరోజు 24 విమానాలతో 110 రూట్లలో సేవలు అందిస్తున్నది. నిర్వహణ ఖర్చులు మూడింతలు పెరిగి రూ.4,814.44 కోట్లకు చేరుకోవడం వల్లనే లాభాలపై ప్రతికూల ప్రభావం చూపింది.

టీఎస్టీపీపీ ఫేజ్-2కు లైన్‌క్లియర్

- 29,345 కోట్లతో నిర్మాణం

జ్యోతినగర్, నవంబర్ 5: పెద్దపల్లి జిల్లా రామగుండంలోని టీఎస్టీపీపీ (తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు) ఫేజ్-2కు రంగం సిద్ధమైంది. రూ.29,344.85 కోట్ల అంచనా పెట్టుబడితో రెండో విడుత 2,400 మెగావాట్ల (800 చొప్పున మూడు యూనిట్లు) విద్యుదుత్పత్తికి మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన ఎన్టీపీసీ కార్పొరేట్ బోర్డు డైరెక్టర్ల సమావేశంలో ఆమోదం లభించింది. కాగా, ప్రాజెక్టు నిర్మాణానికి టెండర్ ప్రక్రియను ప్రారంభించగా.. ఈ నెల 29న ప్రజాభిప్రాయ సేకరణకు తేదీ ఖరారు చేశారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం పూర్తిగా తెలంగాణ అవసరాల కోసం కేటాయించిన 4వేల మెగావాట్ల విద్యుదుత్పత్తిలో భాగంగా రామగుండం ఎన్టీపీసీ ఆవరణలో టీఎస్టీపీపీ ప్లాంట్ నిర్మాణాన్ని చేపట్టారు. మొదటి విడత 1,600 మెగావాట్ల (800 చొప్పున రెండు యూనిట్లు) ప్రాజెక్టును చేపట్టి ఉత్పత్తి దశలోకి తెచ్చారు. మిగతా దానికోసం ప్లాంట్ నిర్మాణం జరుగబోతోంది.

ఇక నిశ్చింతగా విదేశాలకు నగదు బదిలీ

రియల్-టైమ్ ట్రాకింగ్ సర్వీస్‌ను తెచ్చిన ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్

న్యూఢిల్లీ, నవంబర్ 5: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్.. విదేశాలకు నగదు బదిలీ ప్రక్రియను మరింత విశ్వసనీయంగా, పారదర్శకంగా చేసింది. రియల్-టైమ్ ట్రాకింగ్ సర్వీస్‌ను అందుబాటులోకి తెచ్చింది. తద్వారా ఈ తరహా సేవలను ప్రారంభించిన తొలి భారతీయ బ్యాంక్‌గా నిలిచింది. స్విఫ్ట్ గ్లోబల్ పేమెంట్స్ ఇన్నోవేషన్ (జీపీఐ) వేదిక సహకారంతో ఈ కొత్త సౌకర్యం పనిచేయనున్నది. ఇకపై ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ మొబైల్ యాప్ లేదా ఇంటర్నెట్ బ్యాంకింగ్ వేదికల ద్వారా కస్టమర్లు తమ విదేశీ చెల్లింపులను ట్రాక్ చేసుకోవచ్చని, పంపిన మొత్తాలు సదరు విదేశీ బ్యాంక్ ఖాతాలో జమ అయ్యాయో, లేదో సులభంగా తెలుసుకోవచ్చని ఓ ప్రకటనలో బ్యాంక్ వెల్లడించింది. ప్రస్తుతం దేశీయంగా జరుగుతున్న డిజిటల్ లావాదేవీలకే రియల్-టైమ్ స్టేటస్ అప్‌డేట్స్ అందుకునే వీలున్నది. యూపీఐ లేదా ఐఎంపీఎస్ ద్వారా చేసిన చెల్లింపులను యూజర్లు ట్రాక్ చేసుకోవచ్చు.

హిందుస్థాన్ జింక్‌లో అమ్మకానికి ప్రభుత్వ వాటా

- నేటి నుంచి బిడ్డింగ్ మొదలు
- ఒక్కో షేర్ ధర రూ.505

న్యూఢిల్లీ, నవంబర్ 5: హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జెడ్ఎల్)లో 2.5 శాతం వరకు వాటాను కేంద్ర ప్రభుత్వం అమ్మేస్తున్నది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా జరిగే ఈ విక్రయంలో ఒక్కో షేర్ ఫ్లోర్ ధరను రూ.505గా నిర్ణయించారు. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ట్రేడింగ్‌లో మంగళవారం ముగిసిన ధర (రూ.559.45)తో పోల్చితే ఇది 9.7 శాతం తక్కువ. సోమవారం ట్రేడింగ్‌తో చూస్తే సంస్థ షేర్ విలువ 2.99 శాతం లాభపడటం గమనార్హం. కాగా, రెండు రోజులపాటు జరిగే ఈ ఓఎఫ్ఎస్ ద్వారా రూ.5,000 కోట్ల నిధులను మోదీ సర్కారు సమీకరించే వీలున్నది. బుధవారం సంస్థాగత మదుపరులు (నాన్-రిటైల్ ఇన్వెస్టర్లు), గురువారం రిటైల్ ఇన్వెస్టర్లు బిడ్డింగ్ చేసుకోవచ్చు. ఇదిలావుంటే అమ్మేస్తున్న 2.5 శాతం వాటాలో ఈక్విటీ 1.25 శాతంగా ఉంటే, మరో 1.25 శాతం గ్రీన్‌షూ ఆప్షన్‌గా ఉందని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ (దీపం) కార్యదర్శి తుహిన్ కాంత పాండే 'ఎక్స్' వేదికగా తెలిపారు.

డాక్టర్ రెడ్డీస్ లాభం 1341 కోట్లు

హైదరాబాద్, నవంబర్ 5: రాష్ర్టానికి చెందిన ప్రముఖ ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను రూ.1,341.5 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.1,480 కోట్లతో పోలిస్తే 9.35 శాతం తగ్గింది. లాభంలో నిరాశే ఎదురైన సంస్థకు ఆదాయంలో కాస్త ఊరట లభించింది. కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 17 శాతం ఎగబాకి రూ.6,880 కోట్ల నుంచి రూ.8,016 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. ఈ సందర్భంగా కంపెనీ కో-ఛైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ మాట్లాడుతూ..ఉత్తర అమెరికా మార్కెట్లో ధరలు తగ్గుముఖం పట్టడం వల్లనే లాభాల్లో కోత పడిందని, అయినప్పటికీ అన్ని విభాగాలు ఆశాజనక పనితీరు కనబరిచాయన్నారు. మరోవైపు, నికోటినెల్, ఇతర బ్రాండ్‌ల విలీనం పూర్తి కానున్నదన్నారు.

గ్లోబల్ జనరిక్ ఆదాయం కిక్కు

అంతర్జాతీయంగా జనరిక్ ఔషధాలను విక్రయించడంతో భారీ స్థాయిలో ఆదాయం సమకూరింది. గత త్రైమాసికానికి వీటి ద్వారా రూ.7,157 కోట్లు లభించినట్లు పేర్కొంది. దీంట్లో ఉత్తర అమెరికా నుంచే సగం రూ.3,728 కోట్లు లభించడం విశేషం. మిగతాదాంట్లో యూరప్ నుంచి రూ.577 కోట్లు సమకూరగా, భారత్ నుంచి రూ.140 కోట్లు లభించాయి. ఫార్మాస్యూటికల్ సర్వీసెస్ అండ్ యాక్టివ్ ఇంగ్రిడియెంట్స్ ద్వారా వచ్చే ఆదాయం ఏడాది ప్రాతిపదికన 16.76 శాతం పెరిగి రూ.1,103 కోట్లకు చేరాయి.

25 వేల కోట్ల జీఎస్టీ ఎగవేతలు

- 18 వేల బోగస్ సంస్థల గుర్తింపు

న్యూఢిల్లీ, నవంబర్ 5: జీఎస్టీ ఎగవేతలను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఎగవేతలు మాత్రం ఆగడం లేదు. జీఎస్టీ కింద 18 వేల బోగస్ సంస్థలను గుర్తించినట్లు, వీటి ద్వారా రూ.25 వేల కోట్ల పన్ను ఎగవేతలు జరిగాయని జీఎస్టీ ఉన్నతాధికారులు తెలిపారు. మోస పూరిత కంపెనీలకు వ్యతిరేకంగా జీఎస్టీ అధికారులు చేపట్టిన దాడుల్లో 73 వేల కంపెనీలు వివరాలు సేకరించారని, వీటిలో 18 వేల సంస్థలు బోగస్‌వని గుర్తించినట్లు, ఈ సంస్థలు ఎలాంటి వస్తువులకు సంబంధించి ఇన్వాయిస్ లేకుండా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను ఎగ్గొట్టినట్లు గుర్తించినట్లు చెప్పారు. వీటి విలువ రూ.24,500 కోట్లుగా ఉన్నట్లు తెలిపారు. అలాగే ఈ ప్రత్యేక కార్యక్రమంలో పలు సంస్థలు స్వచ్ఛందంగా రూ.70 కోట్ల మేర జీఎస్టీ చెల్లింపులు జరిపినట్లు ఆయన చెప్పారు. మోసపూరిత జీఎస్టీ రిజిస్ట్రేషన్లకు వ్యతిరేకంగా కేంద్ర సర్కార్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఆగస్టు 16 నుంచి అక్టోబర్ చివరి నాటికి దేశవ్యాప్తంగా ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. తొలి విడుత నిర్వహించిన డ్రైవ్‌లో 21,791 సంస్థలు మోసపూరితవిగా గుర్తించారు.

హిందూ సభ మందిర్ బయట నిరసన తెలుపుతున్న హిందువులు

కెనడాలో హిందువుల భారీ ర్యాలీ

ఆలయంపై దాడికి నిరసన

టొరొంటో, నవంబర్ 5: హిందువులపై ఖలిస్థాన్ వేర్పాటువాదుల దాడి కెనడాను కుదిపేస్తున్నది. బ్రాంప్టన్ ఘటనపై కెనడాలోని హిందువులు పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఖలిస్థాన్ వేర్పాటువాదుల దుశ్చర్యలను ఖండిస్తూ సోమవారం బ్రాంప్టన్ నగరంలో హిందువులు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. హిందువులకు వ్యతిరేకంగా కెనడాలో హింస పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. వేలాది మంది హిందువులు భారత త్రివర్ణ పతాకాలను, కాషాయ జెండాలను ప్రదర్శిస్తూ ఈ నిరసనలో పాల్గొన్నారు. ఒంటారియా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హిందువులు బ్రాంప్టన్‌లోని గోరే రోడ్ కూడలి వద్దకు తరలివచ్చారు. కాగా, నిరసనను కెనడా పోలీసులు అడ్డుకున్నారు. నిరసనకు అనుమతులు లేవని పేర్కొన్నారు. ఖలిస్థాన్ వేర్పాటువాదానికి, ట్రూడో సర్కార్‌కు వ్యతిరేకంగా హిందువులు నినాదాలు చేశారు. ఘటన పట్ల ట్రూడో సర్కార్ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

బుల్లెట్ ట్రైన్ బ్రిడ్జి నిర్మాణంలో ప్రమాదం

తాత్కాలిక నిర్మాణం కూలి ముగ్గురు కార్మికుల మృతి

న్యూఢిల్లీ: బుల్లెట్ రైలు ప్రాజెక్టులో భాగంగా గుజరాత్‌లో నిర్మిస్తున్న ఒక బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక నిర్మాణం కూలి ముగ్గురు కార్మికులు మృతి చెందారు. ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు మార్గంలో గుజరాత్‌లోని ఆనంద్ జిల్లా వాసద్ గ్రామంలో మహీ నదిపై నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద గడ్డర్లతో ఏర్పాటు చేసిన తాత్కాలిక కట్టడం మంగళవారం సాయంత్రం కూలిపోయింది. దీంతో నలుగురు కార్మికులు కాంక్రీట్ దిమ్మెలు, శిథిలాల మధ్య ఇరుక్కుపోయారు. దీంతో క్రేన్లు, ఎస్కవేటర్ల సాయంతో సహాయ చర్యలు చేపట్టారు. వీరిలో ఇద్దరు అక్కడికక్కడే మరణించగా, మరో వ్యక్తి దవాఖానలో మృతి చెందాడు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. 508 కి.మీ పొడవు ఉండే ఈ మార్గం గుజరాత్ (352 కి.మీ), మహారాష్ట్ర (156 కి.మీ) మీదుగా సాగుతుంది. బ్రిడ్జి పునాది పటిష్ఠంగా ఉండటం కోసం స్టీల్, కాంక్రీట్ దిమ్మెలతో తాత్కాలిక నిర్మాణం చేపట్టారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on: @SCRailwayIndia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును.
ప్రొఫార్మా 10-01
"బహిరంగ ప్రకటన"
దక్షిణ మధ్య రైల్వేలోని దిగువ తెలిపిన సెక్షన్‌లో పూర్తి చేయబడిన సెక్షన్‌లోగల రైల్వే లైన్లు మరియు ఆవరణలు వినియోగించు వారందరికీ ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, 25000 ఓల్టులు, 50Hz, ac ఓవర్‌హెడ్ ట్రాక్షన్ వైర్లలో సెక్షన్‌కు ఎదురుగా నిర్దేశించిన తేదీన లేదా ఆ తరువాత విద్యుత్ సరఫరా జరుగుతుంది. సదరు తేదీన మరియు నుండి అన్నివేళలా ఓవర్‌హెడ్ ట్రాక్షన్ లైన్లు లైవ్‌గా పరిగణింపబడతాయి మరియు అనధీకృత వ్యక్తి ఎవరూ కూడా సదరు ఓవర్‌హెడ్ లైన్ సమీపంలోకి ప్రవేశించరాదు లేదా పని చేయరాదు.
సెక్షన్: సికింద్రాబాద్ డివిజన్‌లోని కాజీపేట్ - బల్హార్షా సెక్షన్‌లో OHE మాస్ట్ Loc: GDK/G-21 (Km/Chainage 9/148.90) నుండి Loc: 10/3F (Km/Chainage 10/143.70) వరకు రామగుండం స్టేషన్ వద్ద GDK-1 సైడింగ్ యొక్క ఐసొలేషన్ కొరకు కొత్త ఫీడర్ లైన్ విద్యుదీకరణ.
తేది: 07-11-2024
సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/TrD/సికింద్రాబాద్
A1419

అన్ని ప్రైవేట్ ఆస్తుల స్వాధీనం కుదరదు

- ప్రైవేట్ ఆస్తులన్నీ సమాజ వనరులు కావు
- 'ఉమ్మడి ప్రయోజనాల' పేరుతో ప్రభుత్వాలు సేకరించరాదు
- వనరుల స్వభావం బట్టి నిర్ణయం
- సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు

న్యూఢిల్లీ, నవంబర్ 5: ప్రైవేటు ఆస్తుల స్వాధీనంపై సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. 'ఉమ్మడి ప్రయోజనాల' పేరుతో ప్రభుత్వాలు అన్ని రకాల ప్రైవేటు ఆస్తులను స్వాధీనం చేసుకోవడం కుదరదని, అందుకు రాజ్యాంగం వీలు కల్పించడం లేదని స్పష్టం చేసింది. ప్రైవేట్ ఆస్తులను సామాజిక వనరులుగా పరిగణించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చా? లేదా? అనే అంశంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల విస్తృత ధర్మాసనం 7:2 మెజార్టీతో మంగళవారం 193 పేజీల తీర్పును వెలువరించింది. ఈ తీర్పుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో పాటు విస్తృత ధర్మాసనంలో సభ్యులుగా ఉన్న జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ ఎస్‌సీ శర్మ, జస్టిస్ ఏజీ మసీశ్ పూర్తిగా ఏకీభవించగా.. జస్టిస్ బీవీ నాగరత్న పాక్షికంగా ఏకీభవించారు. మరో సభ్యుడైన జస్టిస్ సుధాంశు ధులియా ఈ తీర్పును వ్యతిరేకించారు.

వనరుల స్వభావం, కొరత వంటి అంశాలు ముఖ్యం

'ఆర్టికల్ 39(బీ) కింద ప్రైవేటు ఆస్తులను సమాజ వనరులుగా భావించవచ్చా అనే ప్రశ్నకు 'అవును' అనేది సిద్ధాంతపరంగా సమాధానం. ప్రైవేటు ఆస్తులను సమాజ వనరుల్లో భాగంగా చూడొచ్చు. అయితే, రంగనాథరెడ్డి కేసులో గతంలో జస్టిస్ కృష్ణ అయ్యర్ ఇచ్చిన తీర్పుతో ఏకీభవించలేం. కేవలం సమాజ అవసరాలకు వినియోగించడానికి అర్హత ఉందనే కారణంతో వ్యక్తుల సొంత ఆస్తిని సమాజ వనరుగా చూడలేం. వనరు స్వభావం, లక్షణాలు, కొరత, సమాజ శ్రేయస్సుపై దాని ప్రభావం, ఆ వనరు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉండటం వల్ల పర్యవసానం వంటి అంశాలపై ఏదైనా ప్రైవేటు ఆస్తి సమాజ వనరా? కాదా అనేది ఆధారపడి ఉంటుంది. ప్రజా విశ్వాసాన్ని కూడా ఇక్కడ అన్వయించుకోవచ్చు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కాగా, ఆస్తులను సేకరించేందుకు ప్రభుత్వాలకు చట్టాల నుంచి ఆర్టికల్ 31సీలోని మొదటి భాగం రక్షణ కల్పిస్తుందని చెప్పిన కేశవానంద భారతి తీర్పు కొనసాగుతుందని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, న్యాయ సమీక్ష నుంచి మినహాయింపు ఇవ్వడాన్ని మాత్రం కొట్టేస్తున్నట్టు పేర్కొన్నది.

సీజేఐ వ్యాఖ్యలను వ్యతిరేకించిన ఇద్దరు న్యాయమూర్తులు

1977లో అప్పటి సుప్రీంకోర్టు న్యాయమూర్తి వీఆర్ కృష్ణ అయ్యర్ ఇచ్చిన తీర్పులను చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ తప్పుబట్టారు. ఇది కఠినమైన ఆర్థిక విధానాన్ని ప్రతిపాదిస్తున్నదని పేర్కొన్నారు. 'ఆర్టికల్ 39(బీ)లో అన్ని ప్రైవేటు ఆస్తులను చేర్చడం నిర్దిష్ట ఆర్థిక ఆలోచనా విధానంతో ప్రభావితం కావడమే. భూస్వామ్య, పెట్టుబడిదారీ ఆస్తి కోటలను కూల్చేందుకు ఆర్టికల్ 39(బీ) ప్రభుత్వానికి అధికారాన్ని ఇచ్చిందని జస్టిస్ కృష్ణ అయ్యర్ భావించారు.' అని చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. జస్టిస్ కృష్ణ అయ్యర్ తీర్పులను ఉద్దేశించి సీజేఐ చేసిన వ్యాఖ్యలను జస్టిస్ నాగరత్న, జస్టిస్ సుధాంశు ధులియా వ్యతిరేకించారు. సీజేఐ పరిశీలనలు అసమంజసమని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు. ఈ విమర్శ కఠినంగా ఉందని, దీనిని నివారించాల్సి ఉండేదని జస్టిస్ ధులియా అన్నారు.

కలపతో ఉపగ్రహం

- పూర్తిగా పర్యావరణ అనుకూలం
- ప్రయోగించిన జపాన్ శాస్త్రవేత్తలు

టోక్యో, నవంబర్ 5: అంతరిక్ష రంగంలో జపాన్ శాస్త్రవేత్తలు సరికొత్త ప్రయోగం చేశారు. ప్రపంచంలో మొదటిసారిగా కలపతో చేసిన ఉపగ్రహాన్ని ప్రయోగించారు. క్యోటో విశ్వవిద్యాలయం, సుమిటోమో ఫారెస్ట్రీ అనే పరిశ్రమ కలిసి 'లిగ్నోశాట్' అనే ఈ పర్యావరణ అనుకూల ఉపగ్రహాన్ని తయారుచేశాయి. దీనిని సోమవారం రాత్రి అమెరికాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి బయల్దేరిన స్పేస్ఎక్స్ రాకెట్‌లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపించారు. త్వరలోనే దీనిని భూమికి 400 కిలోమీటర్ల దూరంలో కక్ష్యలోకి ప్రవేశపెట్టాలని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఈ చిన్న ఉపగ్రహాన్ని మగ్నోలియా అనే రకమైన కలపతో 10 సెంటిమీటర్ల సైజులో ఘనాకారంలో తయారుచేశారు. తీవ్రమైన వేడి వాతావరణాన్ని, అంతరిక్ష రేడియేషన్‌ను తట్టుకునేలా దీనిని రూపొందించారు. సాధారణంగా ఇతర లోహాలతో తయారుచేసే ఉపగ్రహాలు మళ్లీ భూమి వాతావరణంలోకి ప్రవేశించినప్పుడు పగిలిపోవడమో, కాలిపోవడమో జరుగుతుంది. ఇవి అల్యూమినియం ఆక్సైడ్ వంటి హానికర కణాలను వాతావరణంలోకి విడుదల చేస్తాయి. చెక్కతో తయారుచేసిన ఈ ఉపగ్రహం భూమి వాతావరణంలోకి ప్రవేశించినప్పుడు పూర్తిగా కాలిపోతుందని, దీని నుంచి ఎలాంటి హానికర పదార్థాలు వెలువడవని శాస్త్రవేత్తలు తెలిపారు. మొదటిసారి చెక్కతో చేసిన ఈ ఉపగ్రహం అనుకున్న రీతిలో పని చేస్తే భవిష్యత్తులో లోహాలతో చేసే ఉపగ్రహాలను నిషేధించవచ్చని శాస్త్రవేత్త తకావో డోయ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

వారానికి రెండు రోజుల వ్యాయామంతో

మెదడు వ్యాధులు దూరం!

న్యూఢిల్లీ, నవంబర్ 5: శారీరక వ్యాయామం మెదడును నాడీ సంబంధిత వ్యాధుల బారిన పడకుండా అడ్డుకుంటుందని తాజా అధ్యయనం వెల్లడించింది. వ్యాయామం వల్ల మెదడు పెద్దదవుతుందని తెలిపింది. వారానికి రెండు, మూడు రోజులు చేసే తక్కువ స్థాయి మొదలుకొని తీవ్ర వ్యాయామానికి, మెదడులోని మొత్తం భాగాలకు సంబంధం ఉంటుందని కెనడియన్-అమెరికన్ పరిశోధన బృందం తెలిపింది. జ్ఞాపకశక్తి, గ్రహణ శక్తిలో కీలకమైన హిప్పోక్యాంపస్, టెంపోరల్ లోబ్‌లలో పెరుగుదల ఉంటుందని చెప్పింది. అధ్యయనంలో పాల్గొన్నవారి మెదళ్ల ఎంఆర్ఐ స్కాన్లను డీప్-లెర్నింగ్ న్యూరల్ నెట్‌వర్క్ సాయంతో పరిశీలించి మెదడు బరువులోని మార్పులను పరిశోధకులు విశ్లేషించారు. మిత లేదా తీవ్ర వ్యాయామం చేసిన రోజుల్లో మెదడు బరువు పెరగడాన్ని గమనించారు. వ్యాయామం సందర్భంగా విడుదలయ్యే బీడీఎన్ఎఫ్ ప్రొటీన్ మెదడు ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందని చెప్పారు. ఇది మెదడును నాడీ సంబంధిత వ్యాధుల బారిన పడకుండా చేసే కీలక అంశాల్లో ఒకటి కావొచ్చని అభిప్రాయపడ్డారు. రోజువారీ తేలికపాటి వ్యాయామాలు కూడా మెదడు ఆరోగ్యానికి దోహదం చేస్తాయని వెల్లడించారు.

ఒడిశాలో రైలుపై దుండగుల కాల్పులు

భువనేశ్వర్, నవంబర్ 5: కొంత మంది దుండగులు ఒడిశాలో నందన్ కానన్ ఎక్స్‌ప్రెస్ రైలుపై కాల్పులకు తెగబడ్డారు. రైలు న్యూఢిల్లీ నుంచి భువనేశ్వర్ వెళ్తుండగా, మంగళవారం ఉదయం ఒడిశాలో భద్రక్-బౌదాపూర్ సెక్షన్‌ల మధ్య కాల్పుల ఘటన చోటు చేసుకుంది. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ముప్పు వాటిల్లలేదు. రెండు రౌండ్లపాటు కాల్పులు జరిగినట్టు రైల్వే అధికారులు గుర్తించారు. అధికారులు రైలును కొంతసేపు ఆపి.. తనిఖీలు జరిపి రైలును ముందుకు పంపించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

ప్రముఖ గాయని శారదా సిన్హా మృతి

న్యూఢిల్లీ, నవంబర్ 5: ప్రముఖ జానపద గాయకురాలు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత శారదా సిన్హా మృతి చెందారు. 72 ఏండ్ల సిన్హా క్యాన్సర్ కారణంగా ఏర్పడిన రుగ్మతలతో అక్టోబర్ 25న ఎయిమ్స్‌లో చేరారు. చికిత్స పొందుతూ మంగళవారం మరణించినట్టు ఆమె కుమారుడు అన్షుమన్ తెలిపారు. బీహార్‌కు చెందిన శారదా సిన్హా భోజ్‌పురి, మైథిలీ, మగాహి భాషల్లో పలు పాటలు పాడారు. ఆమె పాడిన ఛాత్ పూజ పాటలు ఎంతో ప్రసిద్ధిపొందాయి. అలాగే ఆమె మైనే ప్యార్‌కియా, హమ్ ఆప్ హై కౌన్‌లో పాడిన పాటలు ఎంతో హిట్టయ్యాయి.

శరద్ పవార్ రిటైర్మెంట్!

బారామతి, నవంబర్ 5: ఆరు దశాబ్దాలకు పైగా మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న శరద్‌పవార్(83) రాజకీయాల నుంచి తన విరమణపై మంగళవారం సంకేతాలిచ్చారు. భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికల్లో పోటీ చేయనని, యువ తరానికి మార్గదర్శకంగా ఉంటానని తెలిపారు. తాను ఎక్కడో ఒకచోట ఆగిపోవాల్సిందేనని చెప్తూ, రానున్న మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో చివరి పోరాటం చేస్తానని సంకేతాలిచ్చారు. 'నేను అధికారంలో లేను. రాజ్యసభలో నాకు ఇంకా 1.5 సంవత్సరాల పదవీ కాలం ఉంది. ఆ తర్వాత రాజ్యసభకు వెళ్లాలా వద్దా అన్న దానిపై నేను ఆలోచించాలి. నేను లోక్‌సభతో పాటు ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయను. నేను ఎక్కడో ఒకచోట ఆగిపోవాలి. కొత్త తరాన్ని ముందుకు తీసుకురావాలి' అని పవార్ అన్నారు.